వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్‌గా మేడిశెట్టి రామకృష్ణ

మేడిశెట్టి రామకృష్ణ

జడ్చర్ల, డిసెంబర్ 15: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ డైరెక్టర్‌గా జడ్చర్లకు చెందినమేడిశెట్టి రామకృష్ణ ఎంపికయ్యారు.ఆదివారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ మధురై తమిళనాడులో రెండు రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి గాను వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా మేడిశెట్టి రామకృష్ణను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామ కృష్ణ నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మేడిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలోని పేదలకు, అన్నివర్గాల వారికి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అలంపూర్, డిసెంబర్ 15 : మండలంలోని లింగన వాయి గ్రామంలో ప్రమాదవ శాత్తు గడ్డి వాములు దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. బాధిత రైతులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. చుట్టుపక్కల ఇండ్లకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు చేపట్టారు. గ్రామానికి చెందిన రాజు, నాగన్న చెందిన నాలుగు గడ్డి వాములు దగ్ధమైందన్నారు. వాటి విలువ సుమారుగా రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది రవిప్రకాశ్, మహ్మద్ జహంగీర్, అయర్‌నాథ్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరాలివ్వని దేవాదాయశాఖ మంత్రి

- రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లిన కొండా సురేఖ
- పడమటి అంజన్న ఆలయానికి నిధులివ్వలే..

మక్తల్, డిసెంబర్ 15 : నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతున్నారంటూ కొన్ని రోజులుగా స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకొన్నారు. అయితే, బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండాసురేఖకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయానికి వచ్చి హామీలిస్తారంటూ ప్రచారం చేసుకున్నారు. ఇదంతా కేవలం మాటలకే పరిమితమైందని ప్రజలకు అర్థమైంది. ఎలాంటి హామీలివ్వకుండా వెళ్లిపోవడంతో భక్తులు, ప్రజలు ఉసూరుమన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి హామీలివ్వకుండా దేవాలయ శాఖ వారు రిసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివి వెళ్లిపోయారు. దేవాదాయ శాఖ స్క్రిప్ట్ చదువుతూ భక్తులు, కాంగ్రెస్ కార్యకర్తలను మెప్పించే ప్రయత్నం చేసినప్పటికీ అందరూ నిరుత్సాహంలోనే ఉన్నారు. పడమటి ఆంజన్న ఆలయాన్ని డెవలప్‌మెంట్ చేసేందుకు వరాల జల్లులు కురిపిస్తుందేమోనననుకున్న నాయకులు, భక్తులకు నిరాశే మిగిలింది. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారని, త్వరలోనే రానున్న కృష్ణా పుష్కరాల నేపథ్యంలో నదీతీరం వెంట ఉన్న ఆలయాలకు నిధులు కేటాయించే ఆలోచన చేస్తామని మంత్రి చెప్పారు. ఇదిలా ఉండగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రథోత్సవానికి భక్తులు భారీగా హాజరయ్యారు. అయితే, మంత్రి ఆలయానికి రావడంతో భక్తులను క్యూలోనే ఉంచారు. దీంతో వారు ఇబ్బందులు పడ్డారు.

బండి తీస్తున్నారా..

బీ కేర్ ఫుల్

- నిబంధనలు పాటించకుంటే అంతే
- వాహనాల తనిఖీలతో బెంబేలు
- మైనర్, సెల్‌ఫోన్, లైసెన్స్ లేకుండా నడపడంపై కొరడా
- తాగి నడిపితే జైలుకే

రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 15 : వాహనం తీసుకొని బయటకు వెళ్తున్నారా.. అయితే ఒక్కసారి ఆగండి.. వాహనం నడిపే ముందు లైసెన్స్ ఉందా..హెల్మెట్ పెట్టుకున్నారా ? బండికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారా.. లేకుంటే పర్సులో నోట్ల కట్టలు పెట్టుకోవడం మరవకండి.. ఏదుకంటే ట్రాఫిక్ నిబంధనలు ఏమాత్రం ఉల్లఘించినా వేల రూపాయాల జరిమానాలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలను నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి మోటార్ వాహన చట్టం ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. గతంలో పోలిస్తే కొంత వరకు మార్పు వచ్చినా.. ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. నిబంధనలు ఉల్లంఘించినందుకు ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడి ఈ ఏడాది 11నెలలో కాలంలో ఏకంగా కోట్ల రూపాయాలు జరిమానాలు సమర్పించుకున్నారు.

☛ మీ పిల్లల ముచ్చట తీర్చుకోవడానికి చేతికి వాహనం ఇచ్చి బయట పంపుతున్నారా.. అయితే జేబులో మరో రూ. 3,000 పెట్టండి

☛ ఓ రెండు పెగ్గులేసి బండి నడుపుకుంటూ ఇంటికి వెళదామని అనుకుంటున్నారా.. అయితే వెంట ఓ డ్రైవర్‌ను పెట్టుకోండి లేదంటే జైలుకు వెళ్లడమో లేక కోర్టులో విధించే జరిమానానో చెల్లించాల్సి ఉంటుంది.

☛ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్లినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, మితిమీరినా వేగంతో వాహనం నడిపినా జేబులో వేల రూపాయాలు పెట్టుకోవాల్సిందే. ఎందుకంటే పోలీస్ శాఖ మోటార్ వాహన చట్టాన్ని కఠినతరం చేసేందుకు ఎక్కడికక్కడ తనిఖీ చేస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆ ఏముందిలే పట్టుబడ్డప్పుడు వందో, రెండొందలో రాస్తారు కదాని అనుకుంటే పొరపాటు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం వేలకు వేలు జరిమానా విధిస్తున్నారు. ఎన్ని ఉల్లంఘనలు ఎక్కువ చేస్తే అన్నింటికి కలపి మొత్తం జరిమానా విధిస్తున్నారు. ఉదాహరణకు మైనర్ వాహనం నడిపితే రూ. 1000, మైనర్‌లకు ఎలాగో లైసెన్స్ ఉండదు కాబట్టి రూ. 1000, రాష్ డ్రైవింగ్ చేస్తే మరో రూ. 1000 ఇలా మొత్తం రూ. 3000 జరిమానా విదిస్తున్నారు. ఇక వాహనానికి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే ఆదనంగా మరింత జరిమానా పడుతుంది. పాలమూరులో ఇప్పుడు ఇదే తరహలో ఫెనాల్టీలు విధిస్తున్నారు. వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ వేలకువేలు జరిమానాలు విధిస్తున్నారు. గతంలో వందో, రెండొందలో జరిమానా విధించేవారు. ఇప్పుడు రూ. 2500- 3000 వరకు జరిమానాలు విధించడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

☛ అయితే కొద్ది రోజులు దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఫెనాల్టీలు విధించి ఉంటే బాగుండేది. తల్లిదండ్రులు పిల్లలు సరదగా ఫ్రెండ్స్ వద్దకు వెళ్లడానికో, బజార్‌లో ఏదైనా వస్తువు కొనుగోలుకో మైనర్లకు వాహనాలు ఇచ్చి పంపుతున్నారు. ఇప్పుడు రూ. 3000 వరకు జరిమానా విధిస్తుండడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు పోలీసులతో గొడవకు దిగుతున్నారు. కొనాళ్లు నెమ్మదిగా జరిమానాలు విధించి ఆ తరువాత పెద్ద మొత్తంలో విధిస్తే బాగుండేదన్న అభిప్రాయం వాహనదారుల్లో నెలకొన్నది. అయితే జరిమానాలు పెద్దమొత్తంలో విధించడం వల్ల మార్పు కూడా వేగంగా వచ్చే అవకాశం ఉన్నది. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడతారు. వాహనాలు ఉన్నా లైసెన్స్‌లు తీసుకోని వారెందరో ఉన్నారు. దశాబ్దాలుగా వాహనాలు నడుపుతున్నా చాలా మందికి లైసెన్స్‌లు లేవు. ఇప్పుడు వీళ్లంతా లైసెన్స్‌లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

☛ సెల్‌ఫోన్‌లో డ్రైవింగ్, సిగ్నల్స్ జంప్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్‌లను చాలా వరకు నియంత్రించే అవకాశం ఉంటుంది. కొందరు ఆకతాయిలు మితిమీరిన వేగంతో పక్క నుంచి రయ్‌మని దూసుకేళుతుంటాయి. పక్కన వేళ్లేవారు ఒక్కసారి షాక్‌కు గురై కిందపడే ప్రమాదం కూడా లేకపోలేదు.

ప్రజల్లో చాలా వరకు మార్పు వస్తోంది

నిరంతర తనిఖీలతో వాహన నిబంధనల ఉల్లంఘనుల్లో మార్పు వస్తోంది. ఇదివరకు ట్రిపుల్ రైడింగ్ ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు చాలా వరకు తగ్గాయి. డ్రంకెన్ డ్రైవ్‌లో రోజూ పదిమంది వరకు పట్టుబడుతుండగా, ఇప్పుడు తగ్గింది. ఎక్కువగా డేంజరస్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే కేసులు ఉన్నాయి. ఆటో డ్రైవర్లకు బ్యాడ్జి నెంబర్ తొలగించడం వల్ల చాలామంది లైసెన్స్‌లు తీసుకుంటున్నారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధించడంతో వాహనాదారులు మార్పు వచ్చింది.

-భగవంత్ రెడ్డి , ట్రాఫిక్ సీఐ, మహబూబ్‌నగర్

మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

- దరఖాస్తులకు ఈ నెల 20 తుది గడువు
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్ఏసీ) వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 15: షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందించి అర్హులైన వారికి పర్మినెంట్ లైసెన్స్ అందజేస్తామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ మహబూబ్‌నగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) వెంకట్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా అందించే ఈ శిక్షణను నిరుద్యోగులైన షెడ్యూల్డ్ కులాల యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైట్ మోటార్ వెహికిల్ (ఎల్ఎంవీ), హెవీ మోటార్ వెహికిల్(హెచ్ఎంవీ) కోర్సుల్లో మొత్తం 38 రోజులు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఎల్ఎంవీ శిక్షణ హైదరాబాద్‌లోని హకీంపేట డ్రైవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో, హెచ్ఎంవీ శిక్షణ మహబూబ్‌నగర్‌లో టీజీఎస్ఆర్‌టీసీ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఉంటుంది. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు. ఎల్ఎంవీ శిక్షణకు వయస్సు 18-35 సంవత్సరాల లోపు కలిగి కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. హెచ్ఎంవీ శిక్షణ పొందుటకు వయస్సు 20-35 ఏండ్ల లోపు వయస్సు ఉండి, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై లైట్ మోటార్ వెహికిల్ లైసెన్సు పొంది ఏడాది పూర్తయిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాల యువతీ, యువకులు బయోడేటాతో పాటు కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్, విద్యార్హతల సర్టిఫికెట్లు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపర్చి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో మొదటి అంతస్తులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం రూమ్ నెం.105లో ఈ నెల 20వ తేదీ లోగా కార్యాలయ పనివేళల్లో అందజేశారు. వివరాలకు 9849905996ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

17న చలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 15: గ్రామ పంచాయతీ సమస్యలపై ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగానే జీపీ కార్మికులకు జీతం రూ.18వేలు, ప్రమాద బీమా రూ.10లక్షలు, అంత్యక్రియలకు రూ.30వేలు తక్షణమే ఇవ్వాలని, కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రూప్-2పేపర్‌లో గంగాపూర్ చెన్నకేశవస్వామి ఆలయ ప్రశ్న

జడ్చర్ల, డిసెంబర్ 15: ఆదివారం జరిగిన తెలంగాణ గ్రూప్-2పరీక్షలో జడ్చర్ల మండలం గంగాపూర్ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ఊరి పేరు జతపరుచుము అనే ప్రశ్న వచ్చింది. ఆలయాలున్న ప్రాంతాలను జతపరచాలని అనే ప్రశ్నను అడిగారు. అందులో జడ్చర్ల మండలం గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన ప్రశ్నను కూడా అడగటం జరిగింది.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

బాలానగర్‌లో పీఏసీసీఎస్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, డిసెంబర్ 15 : బాలానగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాలానగర్ మండలకేంద్రంలో రూ. 75లక్షలతో నిర్మించిన పీఏసీసీఎస్ భవనం, వ్యాపార సముదాయాన్ని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో అధ్యక్షుడు పట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పీఏసీసీఎస్‌కు ప్రహరీ తదితర సౌకర్యాల ఏర్పాటుకు రూ. 30 లక్షల వరకు అవసరం ఉందని పేర్కొనగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోటాకు డబ్బులు మంజూరైన వెంటనే పీఏసీసీఎస్ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తానన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అశ్విని, సీఈవో శ్యాంసుందర్, డైరెక్టర్లు, రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 15 : అలంపూర్ చౌరస్తా సమీపంలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు కర్నూల్ జిల్లా గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మహేశ్ బైక్‌పై మోసంబి పండ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే గ్రామం నుంచి పండు తెచ్చి ఉండవెల్లి మండలంలో అమ్ముకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా అలంపూర్ చౌరస్తా సమీపంలో ఉత్తర ఫిడ్స్ వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రాబడి

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతర త్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పే లోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకునుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.

హింటిస్తే చాలు అల్లుకు పోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.

తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసిత నంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరి చ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్నదాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాములిన్ చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా అవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం